
ప్రజాశక్తి
ఆదివారం 8 జనవరి 2023 5
పార్వతీపురం మన్యం



జైలును తనిఖీ చేసిన జైళ్లశాఖ డిఐజి


జైలును పరిశీలిస్తున్న డిఐజి రవికిరణ్

పాలకొండ : స్థానిక సబ్ జైల్‌ను జైళ్లశాఖ డిఐజి ఎం.రవికిరణ్ శనివారం తనిఖీ చేశారు. అక్కడున్న ముద్దాయిలతో మాట్లాడారు. వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఉచిత న్యాయసేవలు, హక్కులపై వివరించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు కోటదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయన వెంట జిల్లా సబ్‌జైల్ అధికారి ఎ.మోహనరావు, స్థానిక సబ్‌జైలర్ హెచ్.ప్రసాద్ ఉన్నారు.


కళ్లాల్లో ఉన్న ధాన్యం బస్తాలు

ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకోలేక అన్నదాత నానా అవస్థలు పడుతున్నాడు. సకాలంలో ధాన్యం అమ్ముకోలేకపోవడంతో రైతులు మదుపులకు తీసుకొచ్చిన రుణాలు చెల్లించలేపోతున్నారు. ప్రతి ధాన్యం గింజను కళ్లాల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తామని చెప్పిన పాలకులు, అధికారులు ఆఖరు నిమిషంలో చేతులెత్తేశారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకు బస్తాలు కూడా లేవు. పోనీ బస్తాలను రైతులు కొనుక్కొని మిల్లు వద్దకు ధాన్యం తీసుకెళ్తే అక్కడ మిల్లర్లు వివిధ సాకులు చూపుతూ రోజుల కొద్దీ నిరీక్షించేలా విగిసిస్తున్నారు. క్వింటాకు అదనంగా ఐదుకేజీలు ధాన్యం ఇస్తే గానీ వాహనాల్లో ధాన్యం మిల్లుల్లోకి వెళ్లే పరిస్థితి లేదు. ఇందతా అధికారులకు తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి. దీంతో వ్యవసాయం చేయడం దండగని రైతులను విసిగించే పరిస్థితికి పాలకులు తీసుకొచ్చారు.

అమ్మకాలకు అవస్థలు


మిల్లు వద్ద నిలిచిపోయిన లారీలు

- ధాన్యం కొనుగోలు లేక రైతుల ఇక్కట్లు
- గోనె సంచుల కొరత
- ట్రక్‌సీట్లు తీయడంలో జాప్యం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో ధాన్యం కొనుగోలు పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ఇప్పటి వరకూ కేవలం 20శాతం మాత్రమే కొనుగోలు చేసినట్టు వ్యవసాయాధికారులు ఇటీవల జరిగిన మండల సమావేశంలో ఎమ్మెల్యే సమక్షంలోనే వెల్లడించారంటే ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ వైఖరి ఎలా ఉందో అర్థమవుతుంది. మండలంలోని 19 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 33 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారుల లక్ష్యం. అయితే ఇప్పటి వరకూ కేవలం 8వేల టన్నుల ధాన్యం 1750 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు లేక ఎక్కడికక్కడే ధాన్యం బస్తాలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఒక్కొక్క ప్రాంతం నుంచి ఒక్కొక్కలా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు విమర్శలు వెలువెత్తుతున్నాయి. పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ వీరఘట్టంలో పలుమార్లు పర్యటించినప్పుడు 80కేజీల 180 గ్రాములు మాత్రమే ధాన్యం తూనికలు చేయాలని, అదనంగా తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించినప్పటికీ మండల స్థాయి అధికారుల నిర్లక్ష్యం వల్ల మిల్లర్లు సబ్ కలెక్టర్ మాటలను బేఖాతరు చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణ రేగులపాడు, కొంచ గ్రామాల్లో 84 కిలోల తూనికలు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. మరోవైపు గోనె సంచులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం కొనుగోలు లేక జగ్గంపేట, నిడదవోలు తదితర ప్రాంతాలకు దళారుల పంటను అమ్ముకుంటున్నారు. మరోవైపు ధాన్యం కొనుగోలు లేక రైతుల కల్లాల వద్ద పడి కాపులు కాయ వలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఎక్కడ లారీలు అక్కడే

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం అనుసంధానం చేసే మిల్లులకు తరలించేందుకు వీలుగా ట్రక్కు సీటు అనుమతులు పొందేందుకు ఇంటర్‌నెట్ పనిచేయకపోవడంతో కొనుగోలు చేసిన ధాన్యం వివిధ ప్రాంతాలకు తరలించేందుకు ఎక్కడ లారీలు అక్కడే దర్శనమిస్తున్నాయి. వీరఘట్టం మండల కేంద్రంతో పాటు విక్రంపురం, వండువ, తెట్టంగి, చిదిమి, తదితర గ్రామాలకు చెందిన రైతుల ధాన్యం లారీలకు లోడ్ చేసి నాలుగు, ఐదు రోజుల నుంచి లారీలు ఉండిపోవడం వల్ల ఇటు రైతులు, అటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంక ఎన్ని రోజులు పరిస్థితి ఏర్పడుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ధాన్యాన్ని అమ్ముకోలేకపోతున్నాము

జియ్యమ్మవలస : మండలంలోని ధాన్యం అమ్ముకోలేని పరిస్థితి నెలకొందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని భారాలను తమపైనే వేస్తూ ప్రభుత్వం తప్పు ఉంటుందని వాపోతున్నారు. బస్తాల నుండి ధాన్యం మిల్లుకు వెళ్లే వరకు రైతులే బాధ్యత పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు తూకంలో కూడా మోసాలు జరుగుతున్నాయని, క్వింటాకు నాలుగు నుంచి ఐదు కిలోల వరకూ అదనంగా ధాన్యం తూకం వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా మిల్లర్ల దోపిడీపై అధికారులుగానీ, పాలకులు గానీ ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌బికెల వద్ద రోజుల తరబడి ట్రక్కు సీట్లు కోసం నిరీక్షించాల్సి వస్తుందని, వాహనాలను కూడా తామే ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. సంక్రాంతి చేరువవుతున్నా పొలాల్లోనే ధాన్యాన్ని ఉంచుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, ప్రభుత్వ విధానాల ఫలితంగా పండించిన పంటను అమ్ముకోలేక ఇంట్లో ఉంచుకోలేక చేసిన అప్పుల తీర్చలేక దిక్కుతోచని స్థితిలో నానా అవస్థలుపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


దళారులతో నష్టపోతున్నాం



దళారీల వల్ల తీవ్రంగా నష్టపోతున్నాం. తేమ ఉన్నాయంటూ మిల్లుకు వెళ్లిన ధాన్యం మిల్లర్లు నిలిపివేశారంటూ ప్రసారం చేస్తూ రైతులను దళారీలు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వేలాది రూపాయలు మదుపులు పెట్టిన ధాన్యాన్ని అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడింది. కనీసం అమ్మిన ధాన్యానికి డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. సంక్రాంతి ముందు రైతులు ఆనందంగా ఉండాల్సిన స్థితిలో ధాన్యాన్ని అమ్ముకోలేక బాధపడాల్సిన దుస్థితి నెలకొంది. వరిసాగును వదిలేసి వాణిజ్య పంటలను పండించుకోవడం నయమన్న పరిస్థితి ఏర్పడింది.

గురుకు నాగేశ్వరరావు
పెద మేరంగి, జియ్యమ్మవలస మండలం


అధిక ధరలకు గోనెలు కొనుగోలు చేస్తున్నాం



ధాన్యం అమ్ముకోడాని కోసం బస్తాలకు వెళితే రైతు భరోసా కేంద్రాల వద్ద లభించడం లేదు. దీంతో ధాన్యం బస్తాలను కొనుక్కోవాల్సి వస్తుంది. రూ.3వేలు వెచ్చించి 300 ధాన్యం బస్తాలను కొనుగోలు చేశాను. వాహనాన్ని కూడా నన్నే ఏర్పాటు చేసుకోమని రవాణా ఛార్జీలు కూడా తానే భరించాలని అధికారులు చెబుతున్నారు. పండించిన పంటను వదులుకోలేక అష్ట కష్టాలుపడాల్సి వస్తుంది.

మిరియాల సింహాచలం,
తుంబలి, జియ్యమ్మవలస మండలం.

ప్రభుత్వ విధానాల వల్లే ఈ దుస్థితి



కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోలేని పరిస్థితి ప్రభుత్వవిధానాల వల్ల నెలకొంది. రైతులం దిక్కులేని పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటను అమ్ముకోలేకపోతున్నాం. అధికారులు చేస్తున్న ప్రకటనలకు, మిల్లర్లు అడుగుతున్న తూకానికి చాలా తేడా ఉంది. నాలుగైదు కేజీలు అదనంగా మిల్లర్లు దోపిడీ చేస్తున్నారని అధికారులు చెప్పినా అరికట్టలేకపోతున్నారు. ధాన్యం ఉండిపోతాయేమోనన్న భయంతో అదనంగా తూకం ఇస్తూ ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

మరడాన జగన్నాథంనాయుడు, రాజయ్యపేట,
జియ్యమ్మవలస మండలం



సదస్సులో మాట్లాడుతున్నన శ్రీకాకుళం జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

'న్యాయ బంధు' ద్వారా న్యాయ సేవలు

ప్రజాశక్తి - సీతంపేట

న్యాయ బంధు యాప్ ద్వారా ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శనివారం ఐటిడిఎలోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశమందిరంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ వినియోగాన్ని మంచి విషయాలకు పరిమితం చేయాలని, ఎటువంటి చెడు విషయాలకు వినియోగించుకోకూడదని అన్నారు. మొబైల్ వినియోగంపై స్వీయ నియంత్రణ ఉండాలన్నారు. విద్యను నిర్లక్ష్యం చేయకూడదని, విద్యకు మించిన ఆస్తి లేదన్నారు. లక్ష్యాన్ని ఏర్పరుచుకొని అందుకు తగ్గట్టుగా మన ప్రయత్నాలు కొనసాగించాలన్నారు. అలాగే మహిళలంతా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు కృషి చేయాలని అన్నారు. ఐటిడిఎ పిఒ బి.నవ్య మాట్లాడుతూ సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని, మంచి, చెడుల గూర్చి అందరూ తెలుసుకోవాలని సూచించారు. జీవన సరళి విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఇంటర్నెట్‌ను మంచి కోసం వినియోగించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, డిఎస్‌పి కృష్ణారావు, జూనియర్ సివిల్ జడ్జ్ విజయరాజ్ కుమార్, పాలకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ, ఎపిఒ రోషిరెడ్డి, నరసింహమూర్తి, ఎంపిడిఒ గీతాంజలి, సిడిపిఒ రంగలక్ష్మి, లాయర్లు వెంకటేష్, సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీ వర్కర్లు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

1.49 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్


జిల్లాలో 1.49 లక్షల మెట్రిక్ టన్నుల (78 శాతం) ధాన్యం సేకరణ పూర్తిచేసినట్లు పౌర సరఫరాల జిల్లా మేనేజర్ దేవుళ్లనాయక్ తెలిపారు. ధాన్యం సేకరణ లక్ష్యం 1.91 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, ఇప్పటి వరకు రూ.346 కోట్లు విలువచేసే లక్షా 49వేల మెట్రిక్ టన్నులు సేకరణ పూర్తి చేసినట్లు తెలిపారు. 1.91 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యానికి గానూ జిల్లాలో 235 రైతుభరోసా కేంద్రాల్లో 31,139 రైతులకు చెందిన 1.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం షెడ్యూలు చేశామన్నారు. రైతుల నుంచి సేకరించిన 1.49 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.212 కోట్లలకు మిల్లర్ల వద్ద రశీదులు జనరేట్ కాగా, అందులో రూ.76కోట్లు చెల్లింపులు జరిగాయని, రూ.136 కోట్లు బ్యాంకుల నుంచి చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. కార్మికులు, గోనెలు సమకూర్చుకొన్న రైతులకు లేబరు చార్జీలుగా రూ.7లక్షల 47వేలు, గోనెలకు రూ.8లక్షల 17వేలు చెల్లించామన్నారు. రవాణా కోసం వాహనాలు సమకూర్చిన ఏజెన్సీలకు రూ.30లక్షలు చెల్లించగా, రూ.10లక్షలు బిల్లులు చెల్లింపులకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నిర్ణీత సమయంలోగా ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు, రైతులకు సకాలంలో చెల్లింపులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి వక్తృత్వపోటీలకు వైష్ణవి ఎంపిక

విజయనగరం : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిపి పురస్కరించుకుని జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఎంఆర్ ఫార్మసీ కళాశాల విద్యార్థిని వి.వైష్ణవి శ్వేత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 23న నేతాజీ జయంత్రి సందర్భంగా పార్లమెంట్ సెంట్రల్ హాలులో యువతకు మాట్లాడే అవకాశం కల్పించేందుకు యువతీ యువకుల ఎంపిక శనివారం ఎంఆర్ డిగ్రీ కళాశాలలో కాన్ఫరెన్సు హాలులో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి జి.విక్రమాదిత్యా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారి నుండి ఒకరికి జాతీయ స్థాయికి ఎంపిక చేసి పార్లమెంట్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీ పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అధ్యాపకులు అభినందించారు.

అంగన్వాడీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

సీతంపేట : శ్రీకాకుళం జిల్లాలోని సారవకోట, కొత్తూరు ప్రాజెక్ట్‌ల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు శనివారం ఐటిడిఎ పీవో బి.నవ్య సమక్షంలో రాతపరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. 12 పోస్టులకు గాను 17 దరఖాస్తులు రాగా, 17 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ ఇంటర్వ్యూల్లో టెక్కలి ఆర్డీవో కార్యాలయ ఎఒ, డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయపార్వతి, సిడిపిఒ రంగలక్ష్మి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛన్ల చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, ఎంపి మాధవి

పింఛన్ల పెంపుతో అవ్వా తాతల కళ్లల్లో ఆనందం

ప్రజాశక్తి - పాచిపెంట

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పింఛన్ల పెంపు కొత్త పింఛన్లు మంజూరుతో అవ్వా, తాతల కళ్లల్లో ఆనందాన్ని నింపారని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన కొత్త పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలానికి కొత్తగా మంజూరైన 330 పింఛన్లను ఆయన చేతులు మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వనని, రూ.64 లక్షల పింఛన్లు అందిస్తున్నారని, పాచిపెంట మండలంలో సుమారు 7వేల పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. గత టిడిపి హయాంలో కొత్త పెన్షన్ మంజూరు చేయాలంటే పాత పెన్షన్‌దారులు చనిపోతే కొత్త పెన్షన్ మంజూరయ్యావని, అది కూడా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి ఉండేదని విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వంలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన అందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. సూర్యుడు ఉదయించక ముందే ఒకటో తేదీన తలుపు తట్టి వాలంటీర్లు పింఛన్లు అందచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపి గొట్టేటి మాధవి, ఎంపిపి బి.ప్రమీల, జెడ్‌పి వైస్‌చైర్మన్ కె.సింహాచలం, ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


రోగితో మాట్లాడుతున్న వైద్యాధికారి

కొటియాలో వైద్య శిబిరం నిర్వహణ

ప్రజాశక్తి - సాలూరు

ఆంధ్రా - ఒడిశా వివాదాస్పద కొటియాలో ఎట్టకేలకు ఎపి అధికారులు శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ తోణాం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అక్కేన అజయ్ ఆధ్వర్యాన సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 70మంది గిరిజన రోగులను పరీక్షించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు ఒడిశా పోలీసులతో సమన్వయం చేసుకుని ఎపి అధికారులు శిబిరాన్ని నిర్వహించారు. గత కొంతకాలంగా ఒడిశా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎపి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకుంటూ వస్తున్నారు. కొద్దినెలల క్రితం ఎగువ శెంబిలో ఎపి ప్రభుత్వం నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని ఒడిశా అధికారులు, పోలీసులు ధ్వంసం చేశారు. ఎపి వైద్య సిబ్బంది, ఇతర ఉద్యోగులను కొటియా వైపు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఒడిశా దుందుడుకు చర్యలను ప్రతిఘటించని ఎపి ప్రభుత్వం ఇంతవరకు ఉదాసీనంగా వ్యవహరించడం చర్చనీయాంశమైంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో కొటియాలో ఎపి ప్రభుత్వం వైద్య శిబిరం నిర్వహించడంపై గిరిజనుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

బిసిలు ఓటు బ్యాంకు మాత్రమే కారాదు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



గత కొద్దిరోజులుగా జిల్లాలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు బిసిల జపం చేస్తున్నాయి. అందులోనూ ముఖ్యంగా విజయనగరం జిల్లా కేంద్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు ఇదే పనిలో ఉన్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. ప్రభుత్వ పదవీ కాలం మరో ఏడాదిన్నర సమయం ఉన్నప్పటికీ అప్పుడే ఎన్నికల వాతావరణం మొదలైంది. ఈనేపథ్యంలో పాలకపార్టీలు బిసిలతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం సహజమే. దశాబ్దాల తరబడి ఇదే తంతుగా ఉంది. ఈ సంగతి కాస్త పక్కనబెడితే ఇటీవల జిల్లాలో మూడు రోజులపాటు పర్యటించిన టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మెజార్టీగావున్న బిసిలను పక్కనబెట్టి ఇతర సామాజిక వర్గాలకు చెందిన నాయకులు పెత్తనం చలాయిస్తున్నారంటూ భారీ స్థాయిలో విమర్శలు చేశారు. ఇటువంటి విమర్శలు కాస్త ఒసి నేతల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఆ రకంగా చూసుకుంటే విజయనగరం నియోజకవర్గంలో ఎక్కువ మంది బిసిలు ఉన్నప్పటికీ అధికార ప్రతిపక్షాల్లో ఒసిల పెత్తనం పెచ్చుమీరింది. అంతెందుకు గడిచిన 50ఏళ్లలో ఒకే ఒకసారి బిసి సామాజికవర్గానికి చెందినవారు (మీసాల గీత) ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. టిడిపిగానీ, వైసిపిగానీ ఎక్కువ సందర్భాల్లో రాజులు, క్షత్రియులకే ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశాన్ని కల్పించాయి. ఇటువంటి తరుణంలో ఇటీవల జిల్లాకు వచ్చిన చంద్రబాబు ఉత్తరాంధ్రా రాజకీయాలను ఉద్దేశిస్తూ బిసిలకు అన్యాయం జరుగుతుందని చెప్పిన విషయం విధితమే. ఇదే నినాదంతో గత కొంతకాలంలో టిడిపి, వైసిపిలోని అసమ్మతీయులు బిసి నినాదంతో ముందుకు సాగుతున్నారు. దీంతో, నాలుగు రోజుల క్రితం సావిత్రీ బాయ్ పూలే జయంతి సందర్భంగా కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ఆమె విగ్రహాన్ని జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే (డిప్యూటీ స్పీకర్) కోలగట్ల వీరభద్రస్వామి ఆవిష్కరించిన విషయం విధితమే. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ బిసి సంఘాల విజ్ఞప్తి మేరకు ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్టు స్పష్టం చేశారు. బిసిల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని చెప్పారు. వాస్తవానికి సావిత్రి భాయ్ పూలే కేవలం బిసిలకే కాదు, యావత్తు సమాజానికీ, ముఖ్యంగా స్త్రీ జాతికి ఎంతో ఆదర్శం. అయినా స్వామి బిసిల కోసం ప్రస్తావన చేయడం వెనుక ఇటీవల చంద్రబాబు వ్యాఖ్యలు, వైసిపిలోని కొంతమంది బిసి నాయుల వేరు కుంపటి వంటి పరిణామాలను ఎదుర్కొనేందుకేనని జనం చర్చించుకుంటున్నారు. ఇటు టిడిపిలో మాజీ ఎమ్మెల్యే మీసాల గీత సహా బిసి సామాజికవర్గానికి చెందిన పలువురు మాజీ కౌన్సిలర్లు రెబల్‌గా ఉండడంతో టిడిపిలో బిసియేతర సామాజికవర్గానికి చెందిన అశోక్‌గజపతిరాజు కూడా తన అనుయాలతో బిసి జపం చేయిస్తున్నారు. అప్పుడప్పుడూ ఆయన కూడా బిసిల జపం చేస్తున్నారు. వాస్తవానికి విజయనగరంలో పేరకు బిసిలు ఎన్నో పదవులు అలంకరించినప్పటికీ పెత్తనం మాత్రం బిసియేతరులే చలాయిస్తున్నారని పలువురి వాదన. అందువల్లే ఇరు పార్టీల్లోనూ కొంతమంది నాయకులు ఆయా పార్టీలకు దూరమయ్యారు. ఈ మాటకొస్తే బిసి రిజర్వేషన్‌తో విజయనగరం తొలిమేయర్‌గా ఎన్నికైన వెంపడాపు విజయలక్ష్మికి పరిపాలనలోవున్న స్వేచ్ఛ ఎంత? అన్నది పరిశీలిస్తే నేతిబీరకాయలో నెయ్యి వెతికిన చందమే అన్నది మెజార్టీ కార్పొరేటర్ల ఆవేదన. కార్పొరేటర్లే కాదు, రాజకీయ నాయకులు, కాస్త పాలనాపరమైన అంశాలపై అవగాహన ఉన్నవారు సైతం ఇదే మాట చెబుతున్నారు. కార్పొరేషన్‌తోపాటు మేయర్ పదవిపైనా బిసియేతరులదే పెత్తనంగా ఉందని వాదిస్తున్నారు. అంతకు ముందు టిడిపి తరపున మున్సిపల్ చైర్మన్లుగా ఎన్నికైనవారికి కూడా స్వతంత్ర్యంగా పనిచేసే అవకాశం కలగలేదు. ఇలా కేవలం బిసిలకు రిజర్వేషన్లు బట్టి తప్పనిసరి పరిస్థితుల్లో పదవులు కట్టబెట్టడం తప్ప అధికారం బిసియేతరులే చలాయిస్తున్నారంటూ జనం చర్చించుకుంటున్నారు. ఇటువంటి తరుణంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు మరోసారి బిసి నినాదాలతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ధాన్యం కొనుగోలుపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు సమస్య పరిష్కారం నిమిత్తం కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి వ్యవసాయ, పౌరసరఫరాల అధికారులతో శనివారం చినమేరంగిలోని తన క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా ఎక్కడ ధాన్యం కొనుగోలు వెనుకబడి ఉందో తెలుసుకొని జిల్లా అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అదే సమయంలో ప్రభుత్వం వారు కూడా మిల్లుల బ్యాంక్ గ్యారంటీ, కొనుగోలు 1:4 చేయడం వల్ల ఎక్కడైతే ధాన్యం లారీలతో ఉండిపోయిందో అక్కడ ట్రక్ సీట్లు వేగవంతం చేసి మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే కొనుగోలు ప్రారంభ దశలో జిల్లా అధికారులతో మాట్లాడి ఎక్కడెక్కడ ధాన్యం సంచుల సమస్య ఉందో అక్కడే పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారులతో కూడా మాట్లాడుతూ అవసరమైన చోట ధాన్యం తరలించడానికి వాహనాలను ఏర్పాటు చేయాలని, దీనికి అనుకూలంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గరుగుబిల్లి మండలంలోని మిల్లులకు ఇతర నియోజకవర్గాల ధాన్యం రాకుండా నిలిపివేసి కేవలం నియోజకవర్గ పరిధిలోని ఆర్‌బికెలకు మాత్రమే అనుసంధానం చేయించి సమస్య పరిష్కరించాలని సూచించారు. అలాగే ఉల్లిభద్రలో గల శ్రీ విజయ దుర్గ రైస్ మిల్లును కేవలం ఉల్లిభద్ర ఆర్‌బికెకు మాత్రమే అనుసంధానం చేయడం ద్వారా అక్కడ సమస్యకు పరిష్కారం చూపించారు. ఇంకా ధాన్యం కొనుగోలు సమస్య ఎక్కడైనా ఉంటే తమ దృష్టికి తీసుకు వచ్చినట్లైతే సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో వ్యవసాయ, రెవిన్యూ, రవాణాశాఖల అధికారులు పాల్గొన్నారు.

పోటాపోటీగా 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి మూడేళ్ల పాలనలో ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడంతో అభివృద్ధి కుంటుపడిందని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ప్రాంతమైన జర్నలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం, ఇసుక మాఫియా నడుస్తోందన్నారు. గ్రామాల్లో తాగేందుకు నీరు లేకపోయినా మద్యం మాత్రం ఏరులైపారుతోందని విమర్శించారు. ఏజెన్సీలో వందలాదిమంది చదువుకున్న యువతకు నిరుద్యోగ భృతి కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం విచారకరమన్నారు.


సెంటర్ గూడలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న నాయకులు

సెంటర్ గూడలో...

మరోవైపు రెండో వర్గానికి చెందిన ఆశావాహి టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి ఆధ్వర్యంలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని శేరిపురం పంచాయతీ సెంటర్ గూడలో నిర్వహించారు. ఏజెన్సీలో గిరిజన విద్యను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. స్థానికంగా ఉన్న పాఠశాలలను ఎత్తివేయడంతో విద్యార్థులు చదువుకు దూరమై డ్రాప్స్‌గా మారుతున్నారన్నారు. గిరిజనుల హక్కులు, చట్టాలను ప్రభుత్వం కాల రాస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించాలని, అప్పుడే గిరిజన బతుకులు బాగుపడతాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి ఆశావాహి ఆర్ఎస్ఎస్ విజయ్ కుమార్ ఉన్నారు.

కురుపాం : గరుగుబిల్లి మండలం తోటపల్లిలో టిడిపి మండల అధ్యక్షుడు అక్కినేని మధుసూదన్ రావు ఆధ్వర్యంలో శనివారం ఇదేమి కర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వం చేస్తున్నటువంటి అరాచకాల గురించి టిడిపి నాయకులు ఇంటింటి వెళ్లి ప్రజలకు తెలియజేసి రానున్న ఎన్నికల్లో ఈ వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి ఎం. విజయంకుసం, అరకు పార్లమెంట్ బిసి సెల్ కార్యదర్శి అంబటి రాంబాబు, స్థానిక ఎంపిటిసి ఎం.సింహాచలం, మాజీ సర్పంచ్ ఎం.పకీర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



జర్నలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు జగదీశ్వరి


జిఒ కాపీలను దగ్ధం చేస్తున్న సిఐటియు నాయకులు

జిఒ 1ను ఉపసంహరించుకోవాలి

బెలిజిపేట : జీవో నెంబర్ 1ని తక్షణమే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల కార్యాలయం వద్ద శనివారం జిఒ కాపీలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సభలు, ర్యాలీలు రోడ్డు షోలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ ఒకటిని ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కులను కాలరాసేలా బ్రిటీష్ కాలం నాటి జీవోను తెచ్చి ప్రజా ఉద్యమాలను అణిచివేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికుల వేతనాలు, హక్కులు, కోతలు పెడుతున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వంజరపు సత్యనారాయణ, రైస్ మిల్లు వర్కర్స్ అధ్యక్షులు పాలిల అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు వెంకటస్వామి, కూర్మ సురేంద్ర పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రమణారావు

సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా గుర్తించాలి

సీతంపేట : కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా గుర్తించాలని సిఐటియు అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయం ఆవరణలో జరిగిన కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్ల మాదిరిగానే సిహెచ్‌డబ్ల్యూ కూడా వేతనాలు చెల్లించాలని, 17వ సిఐటియు అఖిలభారత మహాసభ బెంగళూరులో జరుగుతాయని, ఈ సందర్భంగా ఈనెల 10న అన్ని పట్టణాలు, మండల, పారిశ్రామిక కేంద్రాల్లో సిఐటియు జెండా ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల సమన్వయ కమిటీ అధ్యక్షులు ఎస్.సురేష్, కార్యదర్శి ఎం.కాంతారావు, కార్యవర్గ సభ్యులు ఎస్.లక్ష్మి, ఎస్.మాలతి, ఎన్.రోయి, హైమావతి తదితరులు పెద్ద ఎత్తున సమావేశంలో పాల్గొన్నారు.

టేకుచెట్ల వేలం వాయిదా

పార్వతీపురంరూరల్ : మండలంలోని పెదమరికి పంచాయితీ, కొత్తవూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న టేకుచెట్లు కోసం శనివారం నిర్వహించిన వేలం వాయిదా పడింది. ఈ సంధర్భంగా హెచ్‌ఎం ఆర్ రమణ మాట్లాడుతూ పాఠశాలలో నాడు నేడు పనులతో పాటు, అదనపు గదుల నిర్మాణం జరగనున్న దృష్ట్యా ఆవరణలోని 19టేకు, 6మామిడి, కుంకుడు చెట్లను తొలగించామన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో స్కూల్ కమిటి, పంచాయితీ సర్పంచ్, కార్యదర్శి, గ్రామ పెద్దల అధ్వర్యంలో వేలం నిర్వహించగా, ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం అంచనా మొత్తం రూ.37,744 చెల్లించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేలం పాట వాయిదా వేసామని తెలిపారు. విషయాన్ని అధికారులకు నివేదించి, తరువాత వేలం తేదిని నిర్ణయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హిమరిక గంగమ్మ, కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్ఎంసి చైర్మన్ కళ్యాణి, గ్రామపెద్దలు పాల్గొన్నారు

జి.శివడలో వైద్య శిబిరం

కురుపాం : మండలంలోని జి.శివడలో 104 ఆధ్యర్యంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కన్సెప్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కె.వెంకట హర్ష 39మందికి వైద్యసేవలు అందించారు. అనంతరం పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, హెల్త్ విజిటర్, ఎంఎల్ హెచ్.శైలజ, హెల్త్ అసిస్టెంట్ రామారావు, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టిటిడి ఆధ్వర్యంలో గిరిజనుల తిరుమల యాత్ర

పార్వతీపురంరూరల్ : సమరసత సేవా పౌండేషన్, టిటిడి ఆధ్వర్యంలో మండలంలోని హరిజన, గిరిజన మత్స్యకార గ్రామాల్లో ఎనిమిది దేవాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా, సంబందిత గ్రామాల నుండి గిరిజనులను తిరమల దేవాలయం దర్శనం కోసం యాత్రా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చప్పవాని వలస, పిండిలోవ గ్రామాలకు చెందిన వారితో బయలు దేరిన బస్సును జడ్‌పిటిసి బలగ రేవతమ్మ, దంపతులు జెండా ఊపి యాత్రను ప్రారంభించారు.

నేడు కథల పుస్తకావిష్కరణ

పార్వతీపురంరూరల్ : ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరినాయుడు రచించిన కథల పుస్తకాన్ని ఆదివారం ఉదయం 9గంటలకు కురుపాం, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవిష్కరిస్తామని స్థానిక స్నేహకళా సాహితీ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పుస్తకాన్ని జిల్లా పంచాయితీరాజ్ ఈఈ ఎంవిఆర్ కృష్ణాజీ ఆవిష్కరిస్తారని, రాజాంకు చెందిన ఆల్తి మోహన్ పరిచయం చేస్తారని నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి

పార్వతీపురం టౌన్ : ఉగాది నాటికి జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు అన్నారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మున్సిపల్ పరిధిలో గల సి-లేఅవుట్, హెచ్.కారాడవలస లే అవుట్‌లో గల 230 ప్లాట్లను కమిషనర్ సచివాలయాల కార్యదర్శితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా లబ్దిదారులతో మాట్లాడుతూ ఉగాది నాటికి గృహ నిర్మాణాలను పూర్తి చేయాల్సిందిగా సూచించారు. అనంతరం లబ్ధిదారులు సమస్యలను తెలపడంతో వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఎఇ, వర్క్ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అగ్రి ల్యాబ్ పరిశీలన

సాలూరు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్ లో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను రీజినల్ కోడింగ్ సెంటర్ డిడి కె.అప్పలస్వామి శనివారం పరిశీలించారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ల్యాబ్‌ను ఆయన పరిశీలించిన డిడి స్థానిక అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట ఎడి మధుసూదనరావు, వ్యవసాయ సహాయకులు వున్నారు.

స్కూల్ స్వీపర్ల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న ఎన్‌వై నాయుడు

సాలూరు : మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ల వేతనాలు పెంచాలని స్వీపర్ల సంఘం గౌరవాధ్యక్షులు ఎన్వైనాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్వీపర్ల కనీస వేతనం రూ.12వేలు చేయాలని కోరారు. గత ఎన్నికల ముందు సిఎం జగన్ మోహన్ రెడ్డి స్కూల్ స్వీపర్ల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ఇంతవరకూ హామీ అమలు చేయలేదన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట స్వీపర్ల సంఘం అధ్యక్షులు హేమలత, కార్యదర్శి లక్ష్మీ వున్నారు.

డోలమడ సచివాలయం తనిఖీ

పాలకొండ రూరల్ : మండలంలో డోలమడ సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాధులు శనివారం సందర్శించారు. అక్కడ రికార్డులతో పాటు పలు అంశాలపై ఆరా తీశారు. బాధ్యతగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా సకాలంలో ప్రజలకు సేవలు అందేలా చూడాలన్నారు.

పెన్షనర్ల ముంగిటకే ట్రెజరీ సేవలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉద్యోగంలో ఉద్యోగ విరమణ చెందిన పెన్షనర్లు కురుపాం ఖజానా శాఖ కార్యాలయానికి వెళ్లి ప్రతి ఏటా తాము బతికి ఉన్నామని తెలియజేసేందుకు సమర్పిస్తున్న లైఫ్ సర్టిఫికెట్ల కోసం ఖజానా శాఖ సిబ్బంది పెన్షనర్ల ముంగిటికే వచ్చి సేవలు అందించడం గమనార్హం. చాలామంది పెన్షనర్లు తమ ఆరోగ్యం రీత్యా ఖజానా శాఖ కార్యాలయానికి వెళ్లేందుకు కూడా ఆరోగ్యం సహకరించకపోవడంతో ఖజానాశాఖ అనుమతితో స్థానిక పెన్షనర్ల సంఘం అసోసియేషన్ సభ్యులు ఈ ఏడాది కూడా గుమ్మలక్ష్మీపురంలో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పణ కోసం స్థానిక గ్రంథాలయంలో శనివారం శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ఖజానా శాఖ కార్యాలయానికి చెందిన సిబ్బంది వచ్చి పెన్షనర్ల నుంచి లైఫ్ సర్టిఫికెట్లు తీసుకొని సేవలు అందించారు. ఈ మేరకు శనివారం సుమారు 85మంది పెన్షనర్ల సర్టిఫికెట్స్ తయారు చేశారు. ఇంకా మరి కొంతమంది మిగిలి ఉన్నారని, అనారోగ్యం కారణంగా రాలేని వారి ఇళ్లకు సంఘ సభ్యులు సిబ్బందితో పాటు వెళ్లి వారి లైఫ్ సర్టిఫికెట్లు తయారు చేయడం జరుగుతుందనీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. అలాగే మారుమూల ప్రాంతాల్లో ఉన్న కొంతమంది పెన్షనర్లు శనివారం రాలేక పోయారని, వారి వివరాలు కూడా తెలియజేస్తే మరోసారి ఇటువంటి కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేసి వారి లైఫ్ సర్టిఫికెట్లు తయారు చేస్తామని అన్నారు. శనివారం నాటి కార్యక్రమానికి సహకరించిన పెన్షనర్ల సంఘం అసోసియేషన్ సభ్యులు జి.హరిప్రసా-దరావు, జగన్నాధరతో, పిఎస్ రామారావుకు ట్రెజరీ శాఖ కార్యాలయం సిబ్బంది, పెన్షనర్లు కృతజ్ఞతలు తెలిపారు.


ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

అందరి సహకారం అవసరం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మానవ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వ సంస్థలతో పాటు, స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతో కీలకమని నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బొడ్డపాటి దాసు, హెచ్ఆర్ఎఫ్ జాతీయ న్యాయ సలహాదారు, హై కోర్టు న్యాయవాది, బి.అయ్యప్ప అన్నారు. శనివారం స్థానిక శ్రీ భాస్కర విద్యాసంస్థల ప్రాంగణంలో మానవ హక్కులు, స.హ చట్టం, తదితర అంశాలపై విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రీజియన్ అధ్యక్షులు ఎం.హరీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో, ఆ సంస్థ ఎపి రాష్ట్ర కమిటీ అధ్యక్షులు శ్రీనిలత, భాస్కర విద్యాసంస్థల చైర్మన్ చుక్క భాస్కరరావు, విశాఖ జిల్లా అధ్యక్షులు నయీమ్, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు సిరువూరి లక్ష్మీ వర్మ, పలనాడు జిల్లా అధ్యక్షుడు ఎస్.కె హుస్సేన్, అనకాపల్లి కార్యదర్శి దుర్గా భవాని, విశాఖపట్నం పట్టణ ప్రతినిధి సుగుణ శైలు, పర్యావరణ పరిరక్షణ సమితి ప్రతినిధి దంతేశ్వరి, తదితరులు మాట్లాడారు. జాతి, వర్ణ, కుల, మత, వివక్షల నుండి రక్షించుకునేందుకు ఈ చట్టం తోడ్పడుతుందని వక్తలు ఈ సందర్భంగా వివరించారు. మానవాళి స్వేచ్ఛగా జీవించేందుకు, మానవ హక్కుల పరిరక్షణ చట్టం ఏర్పాటు అయిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయా అంశాలపై విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ రంగాలలో విశేష సేవలు అందించిన, పలువురికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరిట జాతీయ సేవారత్న అవార్డులను అందజేశారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు బొడ్డుపాటి దాసు, జాతీయ న్యాయ సలహాదారు అయ్యప్ప, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనీలత, సిరివూరి లక్ష్మీవర్మ, మానాపురం హరీష్ కుమార్, నయీమ్, దుర్గ భవాని, టి సుజాత, ఎస్.కె హుస్సేన్, భాస్కర విద్యాసంస్థల ద్వారా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన కరస్పాండెంట్ చుక్క భాస్కరరావు, పర్యావరణ వేత్త దంతేశ్వరి, అవార్డులను సేకరించిన వారిలో ఉన్నారు.



దంతేస్వరిని సత్కరిస్తున్న నిర్వాహకులు

సచివాలయం పనితీరుపై అసంతృప్తి

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలోని సింగన్నవలస సచివాలయం పనితీరుపై డివిజన్ లెవిల్ డవలప్‌మెంట్ అధికారి వి.వి.గోపాలకృష్ణ అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం మండలంలో సింగన్నవలస సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది, వాలంటీర్ల హాజరుపట్టితో పాటు సంక్షేమ పథకాల అనర్హుల జాబితాను పరిశీలించారు. సిబ్బంది హాజరు శాతం కూడా తక్కువుగా ఉండడం పట్ల సక్రమంగా సచివాలయానికి రావాలని సిబ్బందికి హెచ్చరించారు. సేవలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. రోజుకు 3 సేవలే అందుతున్నట్టు గుర్తించి వెల్ఫేర్ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండున్నరేళ్లయి సచివాలయాలు ప్రారంభించినా ఇంతవరకు మీలో మార్పు రాదా అంటూ ప్రశ్నించారు. అనర్హుల జాబితాలో ఎందుకు తొలగించారన్న కారణాలు లేకపోవడంతో వేల్ఫేర్ కార్యదర్శిని ప్రశ్నించారు. సచివాలయం పనితీరు సరిగ్గా లేదని ఇకముందు కూడా ఈ విధంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న వివి.గోపాలకృష్ణ

పాఠశాలల సందర్శన

మక్కువ : మండలంలోని పలు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మేళపువలస, మక్కువ 3, కవిరిపల్లి, పెద్దవలస అంగన్వాడీ కొత్త భవనాల నిర్మాణాలకు స్థలాలను పరిశీలించారు. వివిధ పాఠశాలల్లో నాడు నేడు ద్వారా చేపట్టే వివిధ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వి. మల్లేశ్వరరావు అంగన్వాడి సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ

పుస్తకాలు, పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట ఏం ఫర్ సేవ అనాధాశ్రమ విద్యార్థులకు ఎన్ఆర్ఐ ఆర్.సింహాచలం, రామ్మోహనరావు దంపతులు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొట్టమొదటిగా అనాధాశ్రమ భవనాన్ని కట్టించింది తానేనని పేదలు విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో తన వంతు సహాయాన్ని అందించానన్నారు. అంతేకాక ఇక్కడే పుట్టి పెరిగానని పేద విద్యార్థులకు తనవంత సాయం అందించేందుకు ఎప్పుడు ముందుంటానని వారు అన్నారు. కార్యక్రమంలో మేనేజర్ సురేష్, కమిటీ సభ్యులు కొత్త రవికుమార్, శ్రీనివాస్, అశోక్ కుమార్, గోనా ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.


పుస్తకాలను పంపిణీ చేస్తున్న దంపతులు

ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు వినతి

సీతంపేట : బోయ, వాల్మీకి, బొంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దంటూ ఐటిడిఎ పిఒ బి.నవ్య, శ్రీకాకుళం కలెక్టర్ శ్రీకేష్ లఠ్కర్‌కు వినతిని అందజేశారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే ఆదివాసీల మనుగడను తుంగలో తొక్కడానికి జీవో52ను విడుదల చేశారని డిఎల్ఒ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి, ఆదివాసి జెఎసి సీతంపేట ప్రధాన కార్యదర్శి బిడ్డిక ఉమామహేశ్వరరావు అన్నారు. (

శ్రీకాకుళం జిల్లాలో వడ్డీ వరియా కులస్తులు మాత్రమే ఉన్నారని బెంతు ఒరియాలు లేరని, వీరంతా ఒడిశా నుంచి వలస వచ్చారని తెలిపారు. అలాగే బోయ, వాల్మీకులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బాగా ఎదిగిన కులస్తులని ఎట్టి పరిస్థితుల్లో వారిని ఎస్టీ జాబితాలో కలపకూడదని శామ్యూల్ కమిషన్‌కు వివరించారు. తమ విన్నపాన్ని పరిగణలోకి తీసుకోవాలని, లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని అన్నారు. తక్షణమే 52 జీవోను రద్దుచేయాలని, ఆదివాసీల ఉనికిని కాపాడాలని కోరారు.

ఇసుక మాఫియాపై క్రిమినల్ కేసులు పెట్టాలి

ప్రజాశక్తి -కొమరాడ

మండలంలోని రామభద్రపురంలో గల ఇసుక రీచ్‌పై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి ఇసుక మాఫియా జేపీ కాంట్రాక్టు వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని సిపిఎం మండల కన్వీనర్ కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శనివారం ఇసుక రీచ్ వద్ద సిపిఎం, టిడిపి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడుతూ ఎటువంటి అనుమతుల్లేకుండా ఇసుక మాఫియాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వారికి సహకరిస్తున్న అధికారులపైనా క్రిమినల్ కేసు పెట్టి సిబిఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నాగావళి పక్కన ఉన్న ఇసుక రీచ్ గడిచిన ఐదు నెలలుగా జెపి కాంట్రాక్టరు తమ ఇష్టారాజ్యంగా రాత్రీపగలు భారీ వాహనాలతో ఇసుకను తరలించుకుపోతున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి జెపి కాంట్రాక్టుపై క్రిమినల్ కేసులు పెట్టాలని, అలాగే సిబిఐ ఎంక్వైరీ చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అప్పటికీ అధికారులు స్పందించకపోతే ఇసుక రీచ్ వద్ద భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గాంధీనగరం గ్రామానికి చెందిన యువకులు పాల్గొన్నారు.



ఇసుక రీచ్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం, టిడిపి నాయకులు

22ఎ దరఖాస్తుల పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో పలు రెవెన్యూలో పలువురు జిరాయితీ రైతుల భూములు 22ఎ కింద ప్రభుత్వ భూములుగా నమోద య్యాయి. ఈ మేరకు ఆ రైతుల భూములు కొనుగోలు అమ్మకాలు జరగకపోవడంతో 22ఎలో ప్రభుత్వ భూములుగా నమోదైన తమ భూములను జిరాయితీ భూములుగా మార్చాలని సంబంధిత రైతులు రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు పెట్టుకున్నారు. ఈ మేరకు శనివారం పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలత మండలంలోని పాంచాలి, గురువు నాయుడుపేట, కుడుమూరు, కోనంబందవలస రెవెన్యూ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో దరఖాస్తులు పరిశీలించి ఐదు దరఖాస్తులను పరిష్కరించారు. ఆమెతో పాటు స్థానిక తహశీల్దార్ ఆర్.రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ ఉదయ్‌కుమార్, ఆర్ఐ రామచంద్రరావు, విఆర్ఒలు పాల్గొన్నారు.


రాకర్డులను పరిశీలిస్తున్న చేస్తున్న ఆర్‌డిఒ

భూమి ఎక్కువుందని పథకాలు ఆపేశారు..

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉన్న భూమి కంటే 60 సెంట్లు భూమి ఎక్కువగా ఉందని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏవి రాలేదని మండల కేంద్రంలోని కూరాకుల వీధికి చెందిన కర్రీ సరస్వతి స్థానిక ఎమ్మెల్యే విశ్వాస రాయి కళావతి వద్ద వేడుకుంది. శనివారం కూరాకుల వీధిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పలు వినతులు వెలువెత్తాయి. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విఆర్ఒ సురేష్ కుమార్‌ను పిలిచి తక్షణమే సమస్య పరిష్కరించి సరస్వతికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. మామిడి శ్రీను, బొద్దాన త్రినాథ్ గృహాలు మంజూరు చేయాలని విన్నవించుకున్నారు. వీధిలో ఓ వ్యక్తి తనకంటే వయసు తక్కువ వారు పింఛను అందుకుంటున్నారని, తనకు పింఛను మంజూరు చేయాలని ఎమ్మెల్యే వద్ద విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం పథకాలు అందించాలనే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి. గౌరమ్మ, ఎంపిపి డి. వెంకటరమణ నాయుడు, మండల పరిషత్ పరిపాలన అధికారి వెంకటరమణ, ఎపిఎం జి. శివుని నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పాపారావు, మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి రామచంద్ర రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు లలిత కుమారి, పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని గుచ్చిమిలో రెండో రోజు గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. ఇంకా అర్హులైన పేదలుంటే వారికి కూడా పథకాలు అందించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిటిసి సభ్యులు చల్లాపు జగదీష్, సర్పంచ్ ఎం.శ్రీదేవి వైసిపి నాయకులు బి.శ్రీరాములునాయుడు, శంకర్రావు, ఎం.మన్మథరావు, ఎం.ధనుంజయ నాయుడు, బి.చిట్టిరాజు, బి.సూర్యనారాయణ, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

జియ్యమ్మవలస : మండలంలోని చింతల బెలగాం రహదారి వద్ద శనివారం పోలీసు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ తమ్మయ్య మాట్లాడుతూ వాహనదారులు పక్కగా లైసెన్స్ పొంది ఉండాలని, సిబుక్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ ప్రతి వాహనదారుడు కలిగి ఉండాలని వాహనదారులకు సూచించారు. లైసెన్స్ లేకుండానే వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని వాహనదారులను ఎఎస్ఐ హెచ్చరించారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సరైన పత్రాలు లేని వాహన యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

20 లీటర్ల సారా పట్టివేత

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మండకు చెందిన సవర శ్రీను నారాయణగూడ సమీపాన నాటు సారా తెస్తుండగా ఎస్సై ఎ.నీలకంఠరావు పట్టుకున్నారు. శ్రీనుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎంపిటిసి రాజీనామా

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్



మండలంలోని కృష్ణపల్లి ఎంపిటిసి సభ్యులు భూతాల సుందరి తన పదవికి రాజీనామా చేసినట్లు ఎంపిడిఒ అఖిబ్ జావేద్ శనివారం తెలిపారు. బిఎస్‌సి నర్సింగ్ చదువుకున్న ఆమెకు కమ్యూనిటీ హెల్త్ అధికారిగా ఉద్యోగం లభించడంతో వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా పత్రాన్ని మండల కార్యాలయంలో సమర్పించినట్లు ఆయన తెలిపారు. దీంతో మండలంలోని ఎంపిటిసి సభ్యుల ఖాళీల సంఖ్య మూడుకు చేరుకుంది. గతంలో సర్పంచులుగా ఎన్నికైన కారణంగా బందలుప్పి, ములగ ఎంపిటిసి సభ్యులు యాళ్ల ప్రమీల, సంపంగి రమేష్ తమ పదవులకు రాజీనామా చేశారు.


పారిశుధ్య పనులు చేస్తున్న కూలీలు

గ్రామాల్లో పారిశుధ్య పనులు

సీతానగరం : మండలంలోని పెదఅంకలాం, గుచ్చిమి గ్రామాల్లో సర్పంచులు బలగ శ్రీనివాసరావు, మర్రాపు శ్రీదేవి ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్యం పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా మురుగునీరు తొలగింపు, మంచినీటి బోర్లు వద్ద డ్రైనేజీ వంటి సమస్యలు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. తాగునీటి ట్యాంకులు క్లీనింగ్ చేయడం జరుగు తుందని తెలిపారు. పూడికలు తీతలు చేపడుతున్నా మన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కె.గౌరీశ్వరి, టి.వెంకటరమణ పాల్గొన్నారు.

అన్నవరం పాఠశాల సందర్శన

పాలకొండ రూరల్ : మండలంలో అన్నవరం ప్రభుత్వ పాఠశాల, వెంకంపేట ఎంపీయూపీ పాఠశాలను డిప్యూటీ డిఇఒ విజయకుమారి, డైట్ అధ్యాపకులు తిరుమల చైతన్య, ఎంఇఒ సూర్యానారాయణ శనివారం సందర్శించారు. పాఠశాలలో విద్యాబోధనతో పాటు పరిసరాలను పరిశీలించారు. పలు అంశాలను హెచ్‌ఎం బి.వి.రమణను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పనితీరుపై సంతృప్తి చెందారు. వీరితో పాటు అధ్యాపకులు అనురాధ, ఉమాకుమారి ఉన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ